క్లుప్తంగా

డ్రైనేజీ పైకప్పు నిర్మించండి



సిరిసిల్ల: పట్టణంలోని గోపాల్‌నగర్‌లో టెలీకాం ప్రధాన ఆఫీస్ ఉంది. మున్సిపల్ ఇంజినీర్లు మురుగుకాల్వను నిర్మించారు. టెలీకాం కార్యాలయం గేటు ముందు మురుగుకాల్వపై పైకప్పు వేయకుండా మధ్యలోనే వదిలేశారు. ఫలితంగా ఆ కార్యాలయంలోకి జీపులు, కార్లు వెళ్లడం సాధ్యం కావడం లేదు. మురుగు కాల్వపై నిర్మించాల్సిన సగం కప్పు వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యుడు

సిరిసిల్లటౌన్: రాజన్న స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో దివంగత సీఎం వైఎస్సార్ పేరుతో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరం విజయవంతమైంది. పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సేవాసంస్థ చైర్మన్ కందికట్ల సదానందం మాట్లాడుతూ..పదమూడేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తమ సంస్థను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. సుమారు 200 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గోలి సమ్మయ్య, గున్నాల దేవదాసు, మల్లేశం, వైద్యులు టి.హర్షిత్, తదితరులు పాల్గొన్నారు.

బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: ఆషాఢమాసం సందర్భంగా పట్టణంలోని భక్తులు ఆదివారం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. పిల్లాపాపల్ని చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



నిమ్మపల్లిలో చెక్కులు అందజేస్తున్న నాయకులు

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన చిలుక రవీనాకు రూ. 16,500, మర్యాల శేఖర్‌కు రూ.14వేలు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను డీసీసీ కార్యదర్శి చేపూరి గంగాధర్, గ్రామశాఖ అధ్యక్షుడు పెంతల శ్రీనివాస్ అందజేశారు. ప్రమాదాల్లో గాయపడి అత్యవసర సమయాల్లో చికిత్స పొందేవారికి సీఎంఆర్‌ఎఫ్ వరమ న్నారు. మానుక సత్యం, బానోత్ నరేశ్‌కుమార్, సదానందం, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



ప్రారంభిస్తున్న మాజీ జెడ్పీటీసీ నాగం కుమార్

చందుర్తి: మండలంలోని మూడపల్లిలో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, మాజీ సర్పంచ్ చిలుక అంజిబాబు ఆదివారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నియోజకవర్గ ఇన్‌చార్జి ఈర్లపెల్లి రాజు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, కిసాన్‌సెల్ అధ్యక్షుడు బానాల రవీందర్ రెడ్డి, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు రాక ఇబ్బంది పడుతున్నాం

ఎల్లారెడ్డిపేట: ఎనిమిది నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబాలను పోషించడం ఇబ్బందిగా ఉందని పారిశుద్ధ్య కార్మికులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి దృష్టికి తెచ్చారు. మండలంలోని బండలింగంపల్లిలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ఆదివారం రాగా.. పారిశుద్ధ్య కార్మికులు కలిసి తమ సమస్యలు విన్నవించారు. తమకు జీతం ఇప్పించి ఆదుకోవాలని గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులు ఎల్లవ్వ, లచ్చవ్వ, సూరవ్వలు విన్నవించారు. కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లు సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో ఉన్నాయని, జనవరి వరకు ఓపిక పట్టాలన్నారు. అందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.

సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు ఎప్పుడో ?

- గతంలోనే ట్రాన్స్‌కోకు ప్రతిపాదనలు
- ఇటీవల సెస్ మహాసభలో తీర్మానాలు
- కెపాసిటీ పెంచితే రెండు మండలాలకు నాణ్యమైన విద్యుత్
- సెస్ పరిధిలో కొత్తగా మరిన్ని సబ్‌స్టేషన్లు



బోయినపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్

బోయినపల్లి: సిరిసిల్ల సెస్ పరిధిలోని బోయినపల్లి, తంగళ్లపల్లి మండలం నేరెళ్ల రెండు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు పనులకు మోక్షం కలగడం లేదు. సెస్ పాలకవర్గం ద్వారా ట్రాన్స్‌కో సీఎండీకి ఎనిమిది నెలల క్రితం ప్రతిపాదనలు పంపగా మంజూరు కాలేదు. ఈ రెండు సబ్‌స్టేషన్ల విద్యుత్ సామర్థ్యం 33- 11 కేవీ నుంచి 132–33 కేవీకి పెరిగితే రెండు మండలాల్లోని ఇతర సబ్‌స్టేషన్లకు మెరుగైన విద్యుత్ అందే అవకాశం ఉంది. జిల్లాలో 132 కేవీ సబ్‌స్టేన్లు ఆరు ఉన్నాయి.

జిల్లాలో 76 విద్యుత్ సబ్‌స్టేషన్లు

జిల్లాలో ఇప్పటివరకు 76 దాకా 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు ఉన్నాయి. కొత్తగా తంగళ్లపల్లి మండలం రామన్నపేట, ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి, వీర్నపల్లి మండలం మద్దిమల్ల మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి స్థలం కేటాయించి టెండర్లు పిలిచారు. సిరిసిల్ల టౌన్‌లో కలెక్టర్ బైపాస్ రోడ్డులో, బోయినపల్లి మండలం మాన్వాడలో ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి, చందుర్తి మండలం ఎన్గల్, లింగంపేట, తంగళ్లపల్లి మండలం పద్మనగర్, పాపాయిపల్లి, ఇల్లంతకుంట మండలం గుండారం, వేములవాడ టౌన్‌లో తిప్పాపురం, ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి, వేములవాడరూరల్ మండలం నూకలమర్రి, రుద్రవరం గ్రామాల్లో విద్యుత్ ఉపకేంద్రాల కోసం ఎన్పీడీసీఎల్‌కు సెస్ పాలకవర్గం ప్రతిపాదనలు పంపారు. పెద్దూర్ ఏరియా ఆస్పత్రి, సిరిసిల్ల టౌన్-2లో సుభాష్‌నగర్, గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట, బోయినపల్లి సెస్ పరిధి నల్లగొండ గ్రామాలకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

దూరభారం.. విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి మండలంలో 23 గ్రామాలున్నాయి. ఆరుచోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. ఇందులో వేములవాడ మండలం మల్లారం 132/33 కేవీ సబ్‌స్టేషన్ 33 కేవీ ద్వారా బోయినపల్లి, విలాసాగర్, వెంకట్రావుపల్లి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు మండలంలోని కోరెం, స్తంభంపల్లి, మల్కాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్లకు కొడిమ్యాల మండలం పూడూర్ 132–33 కేవీ సబ్‌స్టేషన్ 33 కేవీ నుంచి నిత్యం విద్యుత్ సరఫరా అవుతుంది. బోయినపల్లి మండలానికి అటు మల్లారం, ఇటు కొడిమ్యాల సబ్‌స్టేషన్లు సుమారు 20 కిలోమీటర్లకు పైగా దూరంలో ఉంటాయి. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో 11 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. నేరెళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో అన్ని కేటగిరిలవి కలిపి సుమారు 27 వేల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇక్కడికి ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి, సిరిసిల్ల పెద్దూర్ 132–33 కేవీ సబ్‌స్టేషన్ల నుంచి 33 కేవీ విద్యుత్ సరఫరా చేస్తున్నారు. ఇవి కూడా దూరంలోనే ఉన్నాయి.

గతంలోనే ప్రతిపాదనలు

బోయినపల్లి, నేరెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల విద్యుత్ సామర్థ్యం 132/33 కేవీ కెపాసిటీ పెంచాలని అప్పటి ట్రాన్స్‌కో సీఎండీకి సెస్ అధికారులు ప్రతిపాదనలు పంపారు. అప్పటి విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ప్రత్యేకంగా కలిశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, సీఎండీ, విద్యుత్‌శాఖ మంత్రి మారడంతో సమస్య పరిష్కారం కావడంలేదు. బోయినపల్లి, నేరెళ్ల సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపుకు వసతులున్నా మంజూరు కావడం లేదు.

తరచూ అంతరాయం



వెంకట్రావుపల్లి 33కేవీ సబ్‌స్టేషన్ నుంచి గ్రామానికి విద్యుత్ సరఫరా అవుతోంది. ఉపకేంద్రం పరిధిలో చాలా గ్రామాలుండగా బోయినపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెరగక తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. 132 కేవీ సామర్థ్యం పెంపుకు సెస్ పాలకవర్గం చొరవ చూపాలి.

– కొనుకటి హరీశ్, నీలోజిపల్లి

సెస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లాం



బోయినపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ సామర్థ్యం పెంచాలని సెస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లాం. బోయినపల్లి మండలానికి వేములవాడ మండలం మల్లారం ఫీడర్ నుంచి, కొడిమ్యాల మండలం పూడూర్ ఫీడర్ల నుంచి విద్యుత్ సరఫరా అవుతుంది.

– కొట్టెపెల్లి సుధాకర్, సెస్ డైరెక్టర్, బోయినపల్లి



ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరంలోని విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కాసర్ల అరుణ్ కుమార్, ఉపాధ్యక్షుడు నర్సయ్య, రాజేశ్, శ్రీనివాస్, రాజశేఖర్, అంజయ్య, కనకచారి, కొండయ్య, రాజు, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

బోయినపల్లి: మండలంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బోయినపల్లి నుంచి వేములవాడ వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం, బోయినపల్లి నుంచి కొత్తపల్లి మండలం బావుపేట వరకు రోడ్డు నిర్మాణం పనులకు, గ్రామాల్లో హైమాస్ట్ లైట్లు, సీసీ రహదారుల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఉదారి నర్సింహాచారి, ఎడపల్లి పరశురాం, సుంకపాక ప్రభు, బోగోజి గంగాధర్ చారి, అమిరిశెట్టి గంగయ్య, మెరుపుల గంగాధర్, కొండం శ్రీనివాసరెడ్డి, మోహన్‌బాబు, ఇల్లెందుల బాలయ్య, శ్రీనివాస్, బ్రహ్మ ప్రసాద్, మధు, విజయేందర్‌రెడ్డి, కిరణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం



పీహెచ్‌సీ పనులకు శంకుస్థాపన చేస్తున్న కేకే మహేందర్‌రెడ్డి, నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండలింగంపల్లిలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 16 హెల్త్ సబ్ సెంటర్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బండలింగంపల్లిలో రూ.16.65 లక్షలతో నిర్మించనున్నట్లు చెప్పారు. మండలంలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో రూ.1.50కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నేతన్నలకు గత ప్రభుత్వం బకాయి పడ్డ రూ.150కోట్లు చెల్లించినట్లు తెలిపారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, జిల్లా కార్యదర్శి గిరిధర్‌రెడ్డి, మైనార్టీ సెలక్షన్ ఎస్కే సాహెబ్, జిల్లా కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, బండారి బాల్‌రెడ్డి, పీఆర్ ఏఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు భగీరథ పనులకు శంకుస్థాపన

వేములవాడ: పట్టణంలోని బాలానగర్ హనుమాన్ ఆలయం వద్ద ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి చేతుల మీదుగా సోమవారం మిషన్ భగీరథ పనులకు శంకుస్థాపన చేయనున్నటట్లు మున్సిపల్ కమిషనర్ అన్వేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు పనులను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలకేంద్రంలోని ఎస్సీ కాలనీలో మాజీ ఎంపీటీసీ దుబ్బాక స్వేచ్ఛ మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం ప్రారంభించారు. ఎంపీటీసీ నిధులు రూ.లక్ష వ్యయంతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినట్లు మాజీ ఎంపీటీసీ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రంజానీ నరేశ్, బీసీసెల్ మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు తలారి నర్సింలు, బట్టు నర్సింలు, నల్ల బుచ్చయ్య, భాను, రాజయ్య, త్రినేత్రం, రాజం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై కాంగ్రెస్ కక్ష

ఎల్లారెడ్డిపేట: విద్యార్థులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి మానుక కుమార్‌యాదవ్ విమర్శించారు. ఎల్లారెడ్డిపేటలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అహంకారపూరిత మాటలు విద్యార్థులను, నిరుద్యోగులను తీవ్ర మానసికక్షోభకు గురిచేస్తుందన్నారు. ఇప్పటికైనా నిరుద్యోగుల డిమాండ్లు తక్షణమే నెరవేర్చాలని కోరారు.

విద్యుదాఘాతంతో పాడిగేదెలు మృతి



మృత్యువాతపడిన పాడిగేదె

చందుర్తి: విద్యుత్ స్తంభాలు కూలి తీగలు తగలడంతో మండలంలోని లింగంపేట గ్రామ శివారులో తర్రె లక్ష్మణ్ అనే రైతుకు చెందిన పాడి గేదెలు మృతిచెందాయి. కట్టలింగంపేట గురున్నాథం చెరువుకు సమీపంలో విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ఏటా వర్షాకాలంలో విద్యుత్ స్తంభాలు చెరువు నీటిలో మునిగిపోతున్నాయి. అయితే విద్యుత్ కనెక్షన్లు తొలగించిన సెస్ సిబ్బంది యాసంగిలో స్తంభాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చారని రైతులు ఆరోపించారు. స్తంభాలు కూలిపోతాయని వాటి కనెక్షన్ తొలగించాలని పలుసార్లు సెస్ అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో ప్రమాదం జరిగిందని రైతులు తెలిపారు. సుమారు రూ.1.50లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. సెస్ అధికారులు పరిహారం చెల్లించి ఆదుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కనిపించని బావి.. పొంచి ఉన్న ప్రమాదం



రహదారి పక్కన చెట్ల పొదలు

ముస్తాబాద్: ముస్తాబాద్-దుబ్బాక ప్రధాన రహదారిపై మద్దికుంట శివారులో చెట్ల పొదల వద్ద వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. మద్దికుంట కల్లు మండువా వద్ద రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ బావికి ఎలాంటి రక్షణ గోడ లేదు. కనీసం అక్కడ బావి ఉన్నట్లు ఎవరికీ తెలియదు. ముస్తాబాద్, దుబ్బాక సింగిల్‌లైన్ రోడ్డు కావడంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే నేరుగా బావిలోకి వెళ్లే ప్రమాదం ఉంది. అయితే ప్రమాదం జరగకముందే బావివద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరామర్శ



మైసయ్యను పరామర్శిస్తున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆగయ్య

ఎల్లారెడ్డిపేట: అనారోగ్యంతో ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న నిరుపేదలకు వైద్య ఖర్చుల కోసం ఆర్థికసాయం అందించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. మండలంలోని బండలింగంపల్లికి చెందిన సాయిరెడ్డి, మండల కేంద్రానికి చెందిన మైసయ్య కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆదివారం వారిని పరామర్శించారు. ఎమ్మెల్యే కేటీఆర్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందే విధంగా చూస్తామన్నారు. ఆయన వెంట కేటీఆర్ పీఏ గన్‌రాజు ఉన్నారు.

సిలిండర్ నుంచి మంటలు

- అప్రమత్తమై అదుపులోకి తెచ్చిన పోలీసులు
- ఊపిరిపీల్చుకున్న స్థానికులు



ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లోని సిలిండర్ నుంచి ఆదివారం రాత్రి మంటలు చెలరేగాయి. పోలీసులు అప్రమత్తమై మంట లను అదుపులోకి తెచ్చారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్ ఎదుట గల ఓ ఇంట్లో బిహార్ కూలీలు అద్దెకుంటున్నారు. వంట చేస్తున్న క్రమంలో సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న సామగ్రికి మంటలు అంటుకొని పెద్దగా మారాయి. గమనించిన పోలీసులు వెంటనే మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఆలయానికి వెళ్లాలంటే మురుగు తొక్కాల్సిందే..



మండెపల్లి ఎల్లమ్మ ఆలయానికి వెళ్లే రోడ్డుపై నిలిచిన మురుగునీరు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ఎల్లమ్మతల్లి ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా ఇతరల జిల్లాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తారు. అయితే గ్రామంలో నుంచి ఆలయానికి వెళ్లేదారి సీసీరోడ్డు అయినా డ్రైయినేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే పారుతోంది. దీంతో భక్తులు మురుగునీటిలో నుంచి ఆలయానికి వెళ్లాల్సి వస్తోంది. దీంతో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎల్లారెడ్డిపేట పంచాయతీ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్ నియమిస్తూ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన దేవరాజు మండలంలోని అల్మాస్‌పూర్‌కు బదిలీ అయ్యారు.

నత్తనడకన వంతెనల పనులు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- అధికారులు ఆదేశించినా ముందుకుసాగని పనులు



హన్మాజిపేటలోని నక్కవాగు బ్రిడ్జి

వేములవాడరూరల్: మండలంలోని పలుగ్రామాల మధ్య నిర్మిస్తున్న హైలెవల్ వంతెనల నిర్మాణ పనులు నెలల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. కొన్నేళ్లుగా వంతెనలు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు గత ప్రభుత్వాలకు విన్నవించగా నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజీపేట, మర్రిపల్లి గ్రామాల వద్ద ప్రారంభమైన వంతెనల నిర్మాణ పనులు కొన్ని రోజులుగా నెమ్మదిగా సాగుతున్నాయి. వర్షాకాలంలో నీటి ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోతున్నా యి. వర్షాకాలం వరకైనా పూర్తిచేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆ బ్రిడ్జిల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తిచేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అయినా పనుల్లో వేగం పెంచకపోవడంతో ఈ వానాకాలంలో సైతం ఈ ప్రాంత ప్రజలు, రైతులకు కష్టాలు తప్పేలా లే వు. మూడ్రోజులక్రితం మర్రిపల్లి బ్రిడ్జి వద్ద లారీ బో ల్తాపడగా పెనుప్రమాదం తప్పింది. గతంలో ఈ బ్రిడ్జి వద్ద పలుసార్లు ప్రమాదాలు జరిగినట్లు గ్రామస్తులు తెలుపుతున్నారు. వేములవాడ నుంచి కోరుట్లకు వెళ్లే ప్రధాన రహదారి ఈబ్రిడ్జి నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.



చెత్తలో స్వచ్ఛవాహనం

కోనరావుపేట: చెత్తను తరలించేందుకు ప్రభుత్వం నుంచి అందించిన స్వచ్ఛ వాహనాలు చెత్తలోనే తుప్పు పడుతున్నాయి. వాటిని వినియోగించకపోవడంతో అవి ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. మండలంలోని వట్టిమల్ల గ్రామపంచాయతీ వద్ద స్వచ్ఛ వాహనాన్ని ఇలా వృథాగా పడేయడంతో అదిలా తప్పుపట్టి పోతోంది.

వర్షాలు కురవాలని కప్పతల్లి ఆట

గంభీరావుపేట: వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు బాగా పండాలని కోరుతూ మండలంలోని ముస్తఫానగర్‌లో యువకులు ఆదివారం కప్పతల్లి ఆట ఆడారు. యువకులు బండ రమేశ్, నాగరాజు గౌడ్, సాయి తదితరులు ఉన్నారు.